మేడిపండ్లు

ఆ పెళ్ళిచేసుకోవటం సావిత్రికి సుతరాము ఇష్టంలేదు. పెళ్ళిచూపులకని శ్రీపతి వొచ్చినప్పుడే, సావిత్రి వాణ్ని అసహ్యించుకొంది. వెంకట్రామయ్యకుగూడా, ఎంతమాత్రం ఇష్టం లేదు. ఎటుగూడీ, పీక్కుచచ్చిందల్లా మహాలక్ష్మమ్మగారే!

“నెత్తిమీద కాసీ బెడితే ఏగానీ ఖరీదు చెయ్యడు. పేక, ముండలు, తాగుడు, దొంగతనం; యిన్ని అవలక్షణాలు గలిగిన అయ్య పెళ్ళానికి కూడు పెడతాడని, పెట్టగలడని నమ్మక మేమిటి? తెలిసి తెలిసీ, దాని గొంతుకోయ్యటం నే నొప్పుకోను. సావిత్రి నాకేగాదు, నీకూ కూతురే! ఆలోచించుకో! తరవాత నీ ఇష్టం” అన్నాడు వెంకట్రామయ్య.

“ఇష్టాయిష్టాలేమిటీ యిందులో? అది సర్గా కాపరం చెయ్యటం, మీ కొక్కరికే యిష్టమైనట్టు, నాకు కానట్టూ మాట్లాడతారేం? చిన్నప్పుడు అంతా అట్లామిటకినోళ్ళే! మీ మట్టుకు మీ సంగతేమిటో చెప్పండి? నలుగురు బిడ్డలతండ్రి అయ్యారుగదా? ఇంకా ఆ మాణిక్యంతో, ఆ వికవికలు, పకపకలూ, ఆ మురుసుకోవటం... ఏమిటిదంతా? కుర్రతనం-ఏదోగడ్డితిన్నాడు. నోరు కడుకొన్నాడు. ఎల్లకాలం ఆ బుద్ధులే వుంటాయా యేం? పెళ్ళాం కాపరానికివొచ్చినతరవాత అన్ని రోగాలు, ఠాక్కున కట్టడిపోతాయి. వాడి కేమండీ? నిక్షేపరాయుడికిమల్లే బిడ్డడుంటేనూ! వేలకువేలు కట్నాలు గుమ్మరించినా మొగసనివాళ్ళు చిల్లికానీ తీసుకోకుండా చేసుకొంటామన

టమే పదివేలు. ఇంతకంటే మంచివాణ్ణి మీరు తీసుకొస్తారేం, నే చూస్తానే" అన్నది మహాలక్షమ్మగారు. వెంకట్రామయ్య ఇంకేమీ మాట్లాడలేదు. "మీరూ మీరూ కట్టకట్టుకొని ఆ గంగలో దూకండి. నాకేం సంబంధం లేదు" అని తాత్కాలికంగా అస్త్రసన్యాసం చేశాడు.

పీటలమీదికి రాబోయ్యేవరకూ, సావిత్రి ఏడుస్తూనే వుంది. పేరంటాళ్ళు పసుపుపూస్తే చెరిపేసుకొంది. బుగ్గనకాటిక పెడితే తుడిచేసుకుంది. పీటలమీదకూచున్న దానివాలకం చూస్తుంటే, 'పెళ్ళి చేసుకోబోతున్నాను' అనే వుత్సాహం ఏ కోశానా కనబడదు. మహాభయంకరాపదలోకి బలవంతాన తొయ్యబడుతున్నదానికి మల్లె వుంది.

మూడుముళ్ళూ పడ్డయ్. మహాలక్షమ్మగారి ప్రాణాలు కుదటబడినాయి. అంతవరదాకా, ఆమెను గుండె 'పింజం పింజం' అంటూనే వుంది. సావిత్రిసంగతి ఆమెకు తెలుసు. సరిగ్గావున్నదా సరేసరి. సరితప్పిందో దానిమాటకు ఛోకాలేదు. గత నాలుగురోజులనుండీ, కూతుర్ని కాపాడలేక ఆమె ప్రాణాలు పోతున్నయ్. అంతవరకూ రాదనుకో; అధవా ఈ భడవా ముండ తెగించి, ఏ కాలవలోనో, బావిలోనో దూకితే!

వెంకట్రామయ్యగూడా, ఆ కాస్తకార్యమూ, ఘనంగానే జరిపించాడు. మొదట్లో ఎంత అసహ్యించుకొన్నా, చివరికి అభిమానించక తప్పిందిగాదు. ఐనా అసహ్యించుకొని తను చేయగలిగిందిమాత్రం ఏ ముందిగనక ? పెళ్ళయిపోయింది. ఆరోజునే కార్యంగూడా ఐపోయింది.

కార్యంరోజున మహాలక్షమ్మగారు మళ్ళా కాస్త బిడియ పడింది. శ్రీపతంటే యిదివరకుమోస్తరు, ఈ నాలుగు రోజులూ, సావిత్రి అసహ్యించుకోనిమాట మాత్రం నిజం. అయితే అభిమానంగూడా చూపలేదు. స్తబ్ధుగా వూరుకొంది. తల్లి చెయ్యమన్నట్లల్లా, రుంజుకొంటూనో, గింజుకొంటూనో చేస్తూనేవుంది. ఈ రోజు సంగతేమిటి? ఇది గదిలో సరిగ్గా మిడికేడుస్తుందా? నానారద్ధి చేస్తుందా? కూతురుస్వభావం తెలిసిన మనిషిగనక; మహాలక్షమ్మగారు యిట్లా ఆలోచించ వలసివొచ్చింది.

ఆమె ఆలోచన వృథాపోలేదు. సావిత్రి వోపట్టాన, శ్రీపతిని చెలకట్టనియ్యలేదు. వాడు మహా 'ప్రేమ'తో తమల పాకులు కొరికి నోటికందిస్తే విసిరి పారేసింది. గోవరనగొలుసు మెలికబడితే; పాపం! దాన్ని సర్దుదామని చూసేసరికి గింజు కొని, దూరంగా పోయింది. ఇదంతా గమనిస్తున్న మహా లక్షమ్మ గారికి, అంతమంది ఆడంగుల మధ్యా ప్రాణంవచ్చి వూరుకొంది. కూతుర్ని పిలిచి, నాలుగు చీవాట్లు వేసింది. అల్లుడికి చెప్పవలసినయ్యేమిటో చెప్పింది... కాసేపటికి అంతా సర్దుకొనిపోయింది. తెల్లవారి సావిత్రిని దొడ్లో చూసింతరవాత ఆమెగారి ప్రాణానికి "ఇక తిరుగులే"దంది.

కుక్కకు నెయ్యికూడదుయిమడదు. ఇదెంతో నగ్నసత్యం. కార్యమైన నాలుగోనాడు, శ్రీపతి వేలి వుంగరం అమ్మి, 'ఫిల్టర్' ఆడొచ్చాడు. అవ్వేళ ఎవరి ముఖం చూశాడోగాని, వొక్క ఆటగూడా తను తిప్పిన పాపానపోలేదు. మూడు గంటలకు దూసుకుపోయి, ఇంటికొచ్చి పడ్డాడు. ఆ పగలల్లా

ఎవరూ కనుక్కోలేదు. రాత్రి పడుకోబొయ్యేముందు సావిత్రి అడిగింది.

“మీచేతి వుంగరం యేదీ?”

“ఒక స్నేహితునికి ఎరు విచ్చాను” అన్నాడు శ్రీపతి తొణక్కుండా. అట్లా అన్నందుకు తననుతానే అభినందించు కున్నాడు తరవాత.

“శేవ్వు అడిగితీసుకోండి. ఈ కాలంలో ఎవణ్నీ నమ్మ టానికి వీల్లేకుండావుంది” అన్నది సావిత్రి. ఆమె కెందుకనో ఆవుంగరం ఎరువియ్యాడలేదనే అనుమానంకలిగింది. అందుకనే ఆ వుంగరాన్నిగురించి పాటికి పదిసార్లు హెచ్చరించింది సావిత్రి.

నిజం దాగదు. ఒకప్పుడు గాకపోయినా వొకప్పుడైనా అది బైటపడితీరుతుంది. శ్రీపతి యీ విధంగా వుంగరాన్ని ధ్వంసంచేశాడని ఇంట్లో అందరికీ తెలిసింది. వెంకట్రామయ్య గారు కొంచెం గట్టిగా కేకలేశాడు.

“అది నా వుంగరం. మీరు చేయించిందే ననుకోండి. నాకు పెట్టిన తరువాత అది నా సొమ్ము! నా సొమ్మును నేను అమ్ముకుంటాను, అర్చుకుంటాను. అడగడానికి నువ్వెవరు? నీ కేం అధికారం వుంది? అంతచేటు ఆరాలుతీస్తావని తెలిస్తే అసలు నేను తీసుకోకేపోదును. ముష్టిమూడుచిన్నాల వుంగరం ఏమిటో చేశానని మీరు గొంతుపగిలేట్టు అరవనక్కర్లేదు. కావాలంటే రెండుమూడురోజుల్లో పారేస్తా” నన్నాడు శ్రీపతి అంతకంటే ఏమాత్రమో గొంతుపెంచి. వెంకట్రామయ్య ఇంకేమీమాట్లాడలేదు. మహాలక్షమ్మ గారు మాత్రం

కాసనొచ్చుతుంది. అయినా శ్రీపతి అదే భావాన్ని 'అంత కంటే తక్కువభాషలో' మృదువుగా అన్నట్లయితే, ఆ కాస్తం తయినా నొచ్చుకొని వుండదు.

న్యాయానికి రెండోరోజున శ్రీపతి వుంగరం తీసుకు రావాలి. తీసుకొద్దామనే వుద్దేశంతోనే పాపం "మూడు ముక్కల్లో" కూచున్నాడు. ప్రస్తుతం శ్రీపతిగ్రహాలు ఎదురు తిరిగినయ్యల్లేవుంది. పట్టుధోవతి అమ్మిన యాభై రూపాయలు కాళ్ళొచ్చినట్లు మాయమయిపోయినై. పగలల్లా అతను ఇంటికి రాలేదు. రాత్రి అందరూ అన్నాలుతిని, ఇతనికోసం చూసి చూసి, నిద్రలుపోయినతరువాత, పిల్లిలాగా ఇంట్లో జొరబడి భార్యపక్కలో పడుకున్నాడు. సావిత్రి ఆత నేమీ అడగ లేదు. ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్పు విడిచి "తలనొప్పిగా వుంది" అని కిందచావేసుకొని పడుకొంది. ఇద్దరూ చాలా రాత్రివరకూ మేలుకొనే వున్నారు కానీ ఎవరూ పలకలేదు.

కార్యానికనివాొచ్చిన శ్రీపతి ఆకాస్త మొక్కుబడీఅయిం తర్వాతనైనా ఇంటికి జేరలేదు. ఈలోపునే మరికొన్ని రహస్యాలు వెంకట్రామయ్యగారికి తెలిసినై. ఆ ఆస్తికాస్తా తల్లిపేరవున్న దనీ, తల్లికీ పీడికీ నిప్పులో ఉప్పేసినట్లుగా వుంటుందనీ, కార్యం దాకా వుండకుండా లగ్నమయిన మర్నాడే ఆమె యింటికి వెళ్ళిపోవటానికి కారణం యిదేననీ తెలిసింది. కొడుకు పెళ్ళికి పట్టుమని నాలుగునాళ్ళయినా వుండని భాగ్యశాలి, కొడు కుని నమ్మి ఆస్తి పీడిపేరబెడుతుందని వెంకట్రామయ్యగారు నమ్మలేక పొయ్యాడు. తరవాతనైనా పీడికిస్తుందని నమ్మక మేమిటి? ఆ సమయానికి గొంతులోయిన్ని తులసినీళ్ళు ఎవరు

వొదిలితే వాళ్ళకిస్తుంది. తన కొడుకువిషయం తెలియని మనిషి గనకనా, ఆమెకు నాలుగు బులిబుచ్చికం కబుర్లు చెప్పి, పనివెళ్ళమార్చుకొంటానికి ?

ఆదిలోనే హంసపాదన్నట్లు, పదహారు రోజుల పండగ వెళ్ళేలోగానే ఆగభోగాలుగా తయారయిన రభసను భార్యకు జూపి యాష్టపడ్డాడు వెంకట్రామయ్య. మహాలక్ష్మమ్మ ఎటూ చెప్పలేకపోయింది. మిడిగుడ్లుబెట్టింది. ఏదో వేలువిడిచిన తమ్ముడుగదా అనీ, మరీ పిచ్చిసన్యాసి చెడిపోతాడనీ భావించి ఈపెళ్ళిచేసి, కాళ్ళకు బంధాలువేసి వాక యింటివాణ్ని చేద్దామనుకొంది. చేసింది. కానీ ఈ దౌర్భాగ్యుడు తన మాట నిలబెట్టి చచ్చిందేదీ? కాస్త యీావుమ్మదం తిరిందాకానన్నా వాళ్ళు దగ్గిరబెట్టుకొని ప్రవర్తిస్తే బాగుండేది.

శ్రీపతికి యిక్కడవున్నందువల్ల లాభంలేదని తెలిసిపోయింది. ఏదో మామగారిని అడ్డంపెట్టుకొని చక్రం తిప్పుదామనుకొన్నాడు. మామగారైనా మరీ దరిద్రుడుగాదు. ఇంత కలవాడు. ఇంకా యింత ఆర్జిస్తున్నవాడు. కాస్తోకూస్తో ఘరానా మనుషులతో పరిచయమున్నవాడు. నీళ్ళా మంటూ కాలం గడవకపోతుందా అనుకున్నాడు. కానీ గడవలేదు. మామగారు మాట్లాడటం దాదాపుగా మానేశాడు. మరదలు, బావమరదీ సరేసరి. అదేం ఖర్మమోగానీ అతగాడంటే పిల్లలకు సరిపడదు. పెళ్ళాంగనక సావిత్రికి మాట్లాడక తప్పదు. అదీ కట్టె విరచి పొయిలో బెట్టినట్టు. మహాలక్ష్మమ్మగారే అందరివిలవా మాట్లాడేది. "ఈ తద్దినం మన కెక్కడ చుట్టుకొందిరాబాబూ" అన్నట్టుండేవి అందరిచూపులూ.

ఒకనాటి పుదయం భార్యను ప్రయాణంచేశాడు శ్రీపతి.

"ఎక్కడికీ ?" అన్నాడు వెంకట్రామయ్య.

"మా యింటికి. ఇక్కడెందుకూ? ఉన్న నాలుగు రోజులూ జరిపినమర్యాదలు చాలు, మళ్ళీ జీవితాంతంవరకూ కొంపచాయలకు రాకుండా జేశారు. ఇక్కడేముందని వుండను? ఎవరికోసమని వుండను? వుండవలసిన మనిషేదో నాతోనే వొస్తోంది. ఇక మీకూ నాకూ రాం రాం. బ్రతికుంటే ఏనాటికైనా కలుసుకోలేకపోము" అన్నాడు గంభీరంగా ట్రంకు పుచ్చుకొని.

వెంకట్రామయ్య మనస్సు చివుక్కుమంది. నిజంగా నేన్నేమయినా అతనికి అవమానం చేశానా?" అని సింహావలోకనంచేసుకొన్నాడు. ఒకవేళ చేసినా అది అతన్ని కించపరుద్దామని మాత్రం కాదు.

ఎవ్వరినుండీ సమాధానం రాకముందే శ్రీపతి బయలు దేరాడు. ఇంతవరకూ తలుపు చాటుగా నుంచున్న సావిత్రి గూడా భర్తని అనుసరించింది. వాళ్ళు నాలుగడుగులు నడిచిందాకా చూసి, తరువాత కూతుర్ని వెనక్కిపిలిచి, పాతిక రూపాయలు చేతిలోబెట్టి 'దేనికయినా అక్కరకొస్తాయి దగ్గరుంచుకో అమ్మా. నిన్నిట్లా పంపించటానికి ప్రాణం వొప్పటల్లేదు, ఏంచేసేది? ముందుగా చెబితే నలుగురితోపాటు నేనూ కలిగిందేదో పెట్టి పంపించేవాణ్ని. ఇప్పుడేం చేసేది?' అన్నాడు కూతురు తల నిమురుతూ కళ్ళ నీళ్ళుబెట్టుకొని. సావిత్రి గూడా వొక్కసారి కళ్ళు తుడుచుకొని ముక్కు ఎగ

ఏల్చి 'ఫర్వాలేదులే. నాన్నా! ఆమాత్రం దయుంటే అంతే చాలు' అన్నది.

శ్రీపతిబైటనుండి కేక వేశాడు, 'వెళ్ళగానే వుత్తరం ముక్క రాసిపడెయ్యమ్మా' అంటున్న తండ్రిమాటల్నిగూడా వినిపించుకోకుండా భర్తను అనుసరించింది సావిత్రి.

శ్రీపతి నేరుగా తనింటికి వెళ్ళలేదు. తన పినతల్లిగారింటికి చేరాడు. అక్కడ నాలుగు రోజులుండి, మరో వూళ్ళో మరో చుట్టాలింటికి క్యాంపుకొట్టాడు. ఇట్లా రెండునెలలపాటు పిల్లిని తిప్పినట్లు తిప్పాడు సావిత్రిని. ఆమె ప్రతిరోజూ భర్తను అడిగేది, 'మనింటికి ఎప్పుడు పోదాం?' అని. వాడు యివ్వాళ రేపూ అంటూనే రెండునెల్లు జరుపుకొచ్చాడు. ఈలోపుగా లాలించి, బెదిరించి, సావిత్రి దగ్గర పాతిక రూపాయలూ పుచ్చుకొన్నాడు. ఒంటిమీద నగానట్రా ఖాళీచేశాడు. అన్నీ అయిపోయిన తరవాత పట్నం జేరాడు.

పట్నంలో ఎవరు ఇతని ముఖంచూసేది? అదృష్ట వశాత్తూ అతని పినతండ్రికొడుకు రామచంద్రం వుండబట్టి గానీ, లేకపోతే గతేమిటి? రామచంద్రమైనా వున్నవాడు గాదు. ఏదో కిందా మీదా పడి నాలుగురాళ్ళు తెచ్చుకోగల సమర్థుడు. ఒచ్చిన అన్ననూ, వొదిననూ కాదనలేకపొయ్యాడు. ఉన్నదాంట్లోనే కలోగంజో తాగుదామన్నాడు.

ఎవడికాళ్ళమీద వాడే నిలవటానికి అవకాశం లేని నేటి ఆర్థిక వ్యవస్థలో ఎవడుమాత్రం చిరకాలం మరొకబరువును మొయ్యగలడు? ఈ సంగతి నేరుగా శ్రీపతితో అన్నట్లయితే బాగుండేది. అన్యాపదేశంగా చెబితే తెలుసుకోగల

తెలివితేటలు శ్రీపతికి లేవు. వున్నా వాటిని ఉపయోగపెట్టటం ప్రమాదమని తెలుసుకొనే వుండాలి.

ఆఖరికి తెగించి రామచంద్రం అన్నయ్యతో చెప్పాడు. అంతదాకా శ్రీపతి ఆవిషయాన్ని గమనించనట్టే నటించి—

"ఈసంగతి యింతకాలందాకా నాతో ఎందుకు చెప్పలా? నువ్వు మాకోసం కష్టపడటం నాకేమాత్రం సమ్మతం లేదు. ఈ సాయంత్రమే సైదాపేటకు బసమారుస్తాను. ఒక ప్రైవేటు కంపెనీలో యివ్వాళే నూటపాతిక రూపాయిల జీతంమీద పని కుదిరింది. రేపు వుదయం చార్జి తీసుకోవాలి. ముందుగా ఎడ్వాన్సు అడిగితే బాగుంటుందా? ఒక పాతి కుంటే సర్దు. వారం రోజుల్లో యిస్తాను. తరువాత నువ్వుగూడా మాతోనే వుందువుగాని ఒక్కడివి. ఏం మునిగిపోతుందిలే" అన్నాడు శ్రీపతి. రామచంద్రం నానాగడ్డి కరచి పాతికా యిచ్చి వొదిలించుకొన్నాడు వాళ్ళను.

శ్రీపతి ఆపేటలో ఒక దౌర్భాగ్యపుకొంపలో సావిత్రిని వుంచాడు. దగ్గరున్న పాతికరూపాయలు హారించిపోయిందాకా పనికోసం తిరిగాడు. ఎక్కడ వుంది పని! ఎవరిస్తారు? ఇతగాడి అయిదోతరగతి విజ్ఞానం చూశా!

కూటికి మాడారు. గుడ్డకు మాడారు. నానా అగచాట్లూ పడ్డారు. సావిత్రి తన రాతకు మొగుడు లేకుండా చూసి ఏడ్చేది. అతనుండగా ఏడవటానికిగ్గూడా వీల్లేదు. భార్యను నెత్తురుపడేట్టు కొట్టేవాడు. జుట్టు పట్టుకొని పైకెత్తి కుదేసేవాడు. ఎవరు దిక్కు? ఆ పిల్ల భయంకరఘోష విని జాలిపడే దెవరు?

పగలల్లా ఎన్ని పోట్లాటలు పోట్లాడుకున్నా, ఎన్ని తన్నులాటలు జరిగినా, రాత్రికిమాత్రం ఏమీ వుండేది గాదు. ఉదయం నవ్వుతూ లేచేవాళ్ళు. మళ్ళీ రాత్రికే ఏమన్నా నవ్వితే!

ఈ దెబ్బలు, ఈ తన్నులు, తిట్లు సావిత్రి భరించలేక పోయింది. ఎంత ఆడజన్మ ఎత్తినా సావిత్రికూడా మనిషే గనక అభిమానానికి విరగబడేది. కానీ ఏంలాభం?

అక్కడే వుండాలని సావిత్రి శతవిధాలా ప్రయత్నం చేసింది. లేనివోర్పునంతా కూడగట్టుకొని ఆగి చూసింది. ప్రయత్నా లేమీ ఫలించలేదు. శ్రీపతి ప్రవర్తన రోజురోజుకీ భీకరమైపోవడంతో వొక రాత్రిపూట టిక్కెట్టుకూడాలేకుండా పుట్టింటి కొచ్చిపడింది.

తల్లి, తండ్రి, చెల్లెళ్ళు, అన్నయ్య అంతా విచారించారు. రెండురోజుల దాకా ఎవ్వరూ కడుపునిండా కూడే తినలేదు.

"అంతా శ్రీమన్నారాయణునిలీల. ఈ జీవి ఇట్లా కావాలని రాసిపెట్టివుంది. అయింది. భగవంతుడి నిర్ణయాన్ని తప్పించటం ఎవరితరం?" అన్నది తన తప్పుని సమర్థించుకోటానికి మహాలక్ష్మమ్మగారు. ఆమె అప్పుడప్పుడు వేదాంతం పలుకుతుంది.

"ఏమిటి ఆ నారాయణుడి లీల? నాముందుకు రమ్మను చెప్పుతీసుకు తంతాను. ఇట్లా అని నాముఖాన రాసిపెట్టాడేం? నా రాత యిట్లా బూడిదయి నేను 'లబో'మని ఏడవటం నీ దేవుడికి ఇష్టమా? ఇతరుల ఏడుపుచూసి సంతోషపడే

భ్రష్టుడు వా డేం దేవుడు?" అన్నది సావిత్రి. తల్లి అంటే యిటీవల పరమరోత కలుగుతోంది. తన కిట్లాంటిగతి రావటానికి కారణం తల్లేనని సావిత్రికి క్షుణ్ణంగా తెలుసు. ఈవిడ పట్టు బట్టకపోయినట్లయితే శ్రీపతితో తనకు పెళ్ళి జరగనే జరగదు. హాయిగా యింకో మంచివాణ్ని చూసి చేసుకొనేది.

వెంకట్రామయ్య కూడా సమయమొచ్చినపుడల్లా భార్యను నొక్కిపారేస్తుండేవాడు.

"బంగారమంటి పిల్లను నీ బొంటమీద పెట్టి నీళ్ళిడిచాను. నీవంశం నిర్వంశంగాను, నీదీ ఒక బతుకేనని చెబుతున్నావా?" అంటాడు, వెంకట్రామయ్య ఏదో పేలు చూసుకొని. ఇట్లా అన్నందువల్ల ప్రయోజనమేమీవుండదని ఆయనకు తెలుసు; కొంచెం ఆత్మతృప్తి మినహా.

సావిత్రి ఇక్కడికి వొచ్చిన తరవాత రెండు కార్డులు మాత్రం శ్రీపతి రాశాడు. వీళ్ళు వాటి కేమీ జవాబు రాసినట్టు లేదు. ఆ ప్రకరణం అంతటితో ఆగిపోయింది.

ఇవన్నీ జరిగేనాటికి సావిత్రికి పదహారోఏడు జొరబడింది. ఇంత కొద్దికాలంలోనే దానిబతుకు బద్దలయిపోయింది. భర్తతో సుఖంగా కాపరంచేస్తూ అతని కౌగిలింతల్లో, గిలిగింతల్లో మహత్తరసౌఖ్యాన్ని, అవాచ్యమైన ఆనందాన్ని పొందవలసినసావిత్రి; అతనులేకుండా బిక్కుబిక్కుమని మంచం మీద పడుకొంటుంది. పురుషస్పర్శలతో పులకలెత్తవలసిన రాత్రి నిర్జీవంగా, నిస్సారంగా గడిచిపోతుంది సావిత్రిపట్ల.

కొంతకాలం యిష్టమున్నా లేకపోయినా భర్తతో కాపరంచేసింది. ఆరోజుల్లోనే మగవాడిస్పర్శాసుఖాన్ని అను

భవించింది. అందుకనే పగ లెంతగా భర్తతో రద్దీపడ్డా, రాత్రికి లొంగిపోయేది. ఆ పదినిమషాల కాలమూ మంచిచెడ్డలు, ఉచ్ఛనీచాలు తెలియనియ్యదు. విచారించటం ఆ తరువాత సంగతి. సావిత్రి యవ్వనంలో వుంది. అందులో కొంతకాలం అలవాటుపడిన ప్రాణి. వయసునెత్తురు చేసే తిరుగుబాటు, వయసు హృదయం త్రొక్కే పరవళ్ళు, వాళ్ళ ఆత్మల రసనా వాంఛలు, ముదివగ్గులకు తెలీదు. తృప్తిపడా కామంతీర్చుకొని, పిల్లల్ని కని, ఓపిక చచ్చినవాళ్ళు "కామం అణుచుకోండి" అని ఎన్నైనా నీతులు చెప్పవచ్చు. పాపిటలో వెంట్రుకలు నెరిసినతరువాత పతివ్రతలుకానివా ళ్ళెవరు గనక!

కూతుర్ని మహాలక్షమ్మగారు మహాజాగ్రత్తగా కాపాడుతోంది. సావిత్రి తల దువ్వుకోటానికి లేదు. దువ్వుకొన్నా ముచ్చటగా జడవేసుకోటానికి లేదు. కాస్తంత యిస్త్రీ చీర కట్టుకుంటేను, సబ్బుతో తోముకుంటేనూ మహాలక్షమ్మగారు మొఖం మాడ్చుకొంటుంది.

'ఏమిటమ్మా మరీ విరగబడి చస్తున్నావూ? ఆ నవ్వులేమిటే? ఆ జుట్లు పైకెగదువ్వటాలేమిటే? ఆ సబ్బు లేమిటే? ఇదేమన్నా భోగంకొంపనుకున్నావా? సంసారికొంపనుకున్నావా? ఎవడు చూసి మురవనూ మనసంబంధం? తక్కువ నోములు నోచినప్పుడు తక్కువ వరాలుగాక ఎక్కువరమ్మంటే ఎక్కణ్ణుంచి వొస్తై?" అంటుంది కూతుర్ని. తను చక్కగా అగరునూనె రాసుకొని, సబ్బుతో ముఖం కడిగి, చలవ చీర కట్టుకొని ముస్తాబై.

సావిత్రి ప్రాణంచచ్చి వూరుకొనేది.

కూతుర్ని ఘడియసేపు బైటవుండనియ్యదు! నవ్వని య్యదు. పత్రికలు చదవనియ్యదు.

'పత్రికలు చదివేవాళ్ళు చెడిపోతారు' అంటుంది మహాలక్షమ్మగారు.

తల్లి ఎన్ని చెప్పినా సావిత్రికి నచ్చలేదు. కామం గుడ్డిదట. అది మానవుణ్ణి పశుసమానుణ్ని చేస్తుందిట, దాన్ని అణచుకొంటేనే ఇహమైనా, పరమైనా దొరుకుతుందట. భృకుటీమధ్యంలో వెలిగే జ్యోతి కనిపించాలంటే కామాన్ని చంపుకోవాలట బాగానే వుంది. తన కిన్ని శ్రీరంగనీతులు చెప్పే తల్లి కామాన్ని చంపుకొందా? ఇంతమంది పిల్లలు కలిగినాక గూడా అర్ధరాత్రప్పుడు ఆ 'గుసగుస' లేమిటి? తనకు తెలీదనుకొంది గావును.

ఎందుకీ దొంగజీవితం జీవించటం? ఫలానా వస్తువు 'నీచం' అని అనుకొంటూ దాన్నే అనుభవించటం దేనికి? మానరాదూ? మానటానికి అసాధ్యమైతే 'నీచం' అనుకొని అనుభవించకుండా 'మంచి' అనుభవిస్తే ఏం?

సావిత్రి యీ వాదన సత్యమైనదే! కాని వొప్పుకోగల ధైర్యవంతు లెంతమంది!

మహాలక్షమ్మగారెన్ని చెప్పినా కూతురుప్రవర్తన మారలేదు. అయితే సావిత్రి చేస్తున్న తప్పేమిటి? కాస్త శుభ్రంగా వుండటమా? ఏం అలంకరించుకొంటే? ఏం కొంప మునుగుతుందోనని భయం! తన కూతురు తనరక్తం పంచుకొని పుట్టింది. తను పెంచింది. తనకు రాని "పాడుబుద్ధులు" కూతురుకెందుకొస్తయ్? వీటికి సమాధానం రాదుగానీ ఆమెగారు

మాత్రం కూతుర్ని వెయ్యికళ్ళతో కాపాడుతుంది, పురుషుల చూపులనించి.

అయినా మహాలక్ష్మమ్మగారికి తృప్తి కలగలేదు. పుట్టిన ఈ భడవా 'కాలుజారి'... అయితే ఏమిటి గతి? మొగుడనేవాడొకడుంటే ఆధారంగా ఎన్ని వేషాలైనా వెయ్యొచ్చు. సర్వరోగనివారిణిలాగా వుపయోగపడతాడు ఆ దురదృష్టవంతుడు.

సావిత్రికి నిరభ్యంతరంగా రెండవపెళ్లి చెయ్యొచ్చు. కాస్త శ్రమపడి వెదికితే ఆ మాత్రం సంస్కారం కలిగినవాడు దొరక్కపోడు. దొరుకుతాడు. కాని భర్త బ్రతికుండగానే మరొక భర్తా? లోకులు ఏమనుకుంటారు? వీడు చచ్చిపోతే బాగుండును.

కూతురికి రెండో వివాహం చెయ్యటానికి ధైర్యంలేదు. ఇదా చెప్పినమాట వినిపించుకోవటంలేదు. ఏవాడునైనా భరించవచ్చునుగానీ, వ్యభిచారవాదులను భారతదేశంలో భరించటం కష్టం, ఈ నీతిమంతుల మధ్య.

శ్రీపతి అంటే అందరికీ అసహ్యమే, ఒక్కమహాలక్షమ్మ గారికితప్ప. పైకి ఆమెగారు అసహ్యించుకొన్నా లోపల జాలి పడుతూనే వుంటుంది. వీళ్ళందరిమాటకేంగానీ సావిత్రికే అసలు అతనంటే ఇష్టంలేదు. ఇది పెళ్ళికి ముందునుంచీ అందరూ ఎరిగిన విషయం. భర్తతో కాపరంచేసినంతకాలమూ నిర్మలంగా చేసిందనటానికి ఆధారాలేమీ లేవు. ఇష్టంలేనివాడు, కానీ తప్పనిసరి. విధిలేక వాడితో దైహికంగా వుంటూ మానసికంగా మరొకవ్యక్తిబొమ్మను వూహించుకొని తృప్తిపడి

వుండాలి. అదిగూడా లేకుండా అంతకాలం కలిసి వుండటం అసంభవం.

వెంకట్రామయ్య తిట్టాడు శ్రీపతిని. ఆయనగారు మొదటినుంచీ తిడుతూనే వున్నాడు. భర్త కోసమని మహాలక్ష్మమ్మగారు తిట్టింది. అనుభవించింది గనుక సావిత్రి తిట్టకతప్పదు.

ఇటీవల మహాలక్ష్మమ్మగారికి బ్రహ్మాండమైన, బుర్ర పగిలిపోయి, మెదడు జిగేలుమనే ఆలోచన వొకటొచ్చింది. సావిత్రి ఎంతకాదన్నా వయసులో వున్నది. ముంగిలాగా వుంటూనే ఎప్పుడో కొంప ముంచకపోదు. ఆ వుపద్రవం రాకుండా దీనికి పెళ్ళిచెయ్యటం మంచిది. కానీ... అదే పట్టుకు పీకుతుంది. పోతే ఆ శ్రీపతిగాణ్నే పట్టుకొచ్చి యింట్లో పడేసుకొంటే తీరిపోతుంది. కాళ్ళకుపడిన పాము కరవక మానుతుందా? కొంతకాలం యిట్లా గడిస్తే తరువాత ఎవరిఖర్మం వాళ్ళది.

ఈ ఆలోచన వెంకట్రామయ్యగారికూ్కడా నచ్చింది అల్లుడు ఎంత భ్రష్టుడైనా కూతురు రక్షణకోసం, తమమర్యాద మంటగలపకుండా వుండటంకోసం యింతకుదప్ప వేరుగత్యంతరం లేదు.

తిరిగి తిరిగి శ్రీపతిని పట్టుకొచ్చారు. అక్కడక్కడ మేసి కాస్త కండబట్టి వున్నాడు. నిజంగా శ్రీపతంటే రోత! అయితే వేరుమార్గ మేమిటి?

సావిత్రిగూడా భర్తనుఅట్టే అసహ్యించుకోలేదు. ఒకొ్క రోజు తను అనుభవిస్తున్న దారుణవేదనకంటే ఈ భర్తతో కాపురం చాల మెరుగనిపించిం దామెకు. సావిత్రితల్లిదండ్రులు ఆమె దైహికవాంఛను తీర్చారు. కాని మానసికవాంఛల

సంగతేమిటి ? తన పరువుకోసం కూతుర్ని మానసికవ్యభిచారం లోకి దింపారు. అది కోరిన మొగవాడి కిచ్చి పెళ్ళిచెయ్యలేదు. అది అసహ్యించుకొని త్రోసేసినవాడితో వుండటానికి ఏర్పాటు చేశారు. సావిత్రి అతనితో కాపరం చెయ్యకపోదు, అది తన కిష్టుడైనవాడిబొమ్మను మనస్సులో చిత్రించుకొని వాడే వీడని కృత్రిమతృప్తి పడుతూ. ఈ నీచానికి సావిత్రి తల్లిదండ్రు లేమీ అభ్యంతరపెట్టరు. వాళ్ళకావలసిందేదో వాళ్ళు తయారు చేసుకొని నీతిని కాపాడుకొన్నా మనుకున్నారు.